క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అన్న సంతర్పణ



కుత్బుల్లాపూర్: కట్ట మైసమ్మ తల్లి దీవెనలతో ప్రజలు సంతోషంగా ఉండాలని ఆలయ కమిటీ చైర్మన్ వివేకొరెడ్డి అన్నారు. మంగళవారం జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్ కట్టమైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్న సంతార్పణకు ఉడ్స్‌కాలనీకి చెందిన మల్లేశ్ ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా వివేక్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి మంగళవారం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



కూల్చివేతలు చేస్తున్న కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు

సుభాష్‌నగర్: ప్రభుత్వ స్థలంలో వెలిసిన అక్రమ నిర్మాణాలపై కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు పంజా విసిరారు. గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్‌లోని సర్వే నం.342లో 12గదులు, మూడు బేస్‌మెంట్‌లు, సర్వే నం.307లో మూడు గదులు, రెండు ప్రహరీలను కొంత మంది నిర్మించారు. ఈ విషయమై తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేణుక ఆధ్వర్యంలో మంగళవారం కూల్చివేతలు చేపట్టారు. తమ ఇళ్లు కూల్చవద్దంటూ ప్రజలు మొరపెట్టుకున్నా అధికారులు వినకుండా కూల్చివేతలు చేపట్టారు.

నవజాత శిశువుల సంరక్షణకు అంబులెన్స్

గచ్చిబౌలి: నవజాత శిశువుల సంరక్షణకు అంబులెన్స్ సేవలు అందుబాటులోకి వచ్చాయని ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. మంగళవారం కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో నవజాత శిశువుల సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన అంబులెన్స్‌ను ఆయన ప్రారంభించారు. పుట్టిన శిశువు నుంచి 40 రోజులు శిశువు సంక్షణ కోసం అంబులెన్స్(108)లో ఆక్సిజన్, ఇంక్యుబేటర్‌తో పాటు అత్యాధునిక సౌకర్యాలున్నాయని తెలిపారు. మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో నిలోఫర్, నిమ్స్ ఆస్పత్రులకు తరలించవచ్చన్నారు. జిల్లాకో అంబులెన్స్ కేటాయించారని, రంగారెడ్డి జిల్లా కోటలో కొండాపూర్ ఆస్పత్రికి అంబులెన్స్ కేటాయించారని వివరించారు.

మహ్మద్ ఆరీఫ్‌కు పీహెచ్‌డీ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థికి పీహెచ్‌డీ డిగ్రీని మంగళవారం ప్రకటించారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఉర్దూ విభాగంలో పరిశోధక విద్యార్థి మహ్మద్ ఆరీఫ్‌కు పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ ఉర్దూ కల్చర్ స్టడీస్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అహ్మద్‌ఖాన్, ఉర్దూ విభాగం మాజీ విభాగాధిపతి ప్రొఫెసర్ మహ్మద్ ఫరూఖ్‌భక్షి పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆయన 'ఆజాదీ కే బాద్ ఉర్దూ మే తవీల్ నజ్మ్ నిగరీ కా తంఖీదీ తజ్జియా'అనే అంశంపై పీహెచ్‌డీ థీసిస్‌ను సమర్పించారు. దీంతో వైవా నిర్వహించి ఆయనకు పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు.

సత్ప్రవర్తన కలిగిన ఖైదీలకు క్షమాభిక్ష పెట్టాలి

పంజగుట్ట: తెలిసీ తెలియక, క్షణికావేశంలో చేసిన తప్పుకు కొందరు దశాబ్దానికి పైగా కుటుంబాలకు దూరమై జైళ్లల్లో మగ్గుతున్నారని సత్ప్రవర్తన గల ఖైదీలకు క్షమాభిక్ష పెట్టి వారి కుటుంబాల్లో వెలుగు నింపాలని పలువురు ఖైదీల కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుండి వచ్చిన ఖైదీల కుటుంబ సభ్యులు రాజేష్, సావిత్రి, నసీమాబేగం, విజయలు మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయాక తెలంగాణలో రెండు సార్లు సత్ప్రవర్తన కలిగిన ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదిస్తే, ఆంధ్రప్రదేశ్‌లో ఆరు సార్లు విడుదల చేశారని తెలిపారు. గత ప్రభుత్వాలు ఏటా ఒకసారి సత్ప్రవర్తన కలిగిన ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించేవారని తెలంగాణ ఏర్పాటు అనంతరం 2016లో సుమారు 100 మంది ఖైదీలను విడుల చేసిందని, 2020లో ఖైదీల విడుదలకు జీవో విడుదల చేసిందని అందులో క్షమాభిక్షకు 390 మంది ఖైదీలు అర్హులు కాగా తరువాత జీఓలో మార్పు చేసి ఏడు సంవత్సరాల శిక్షాకాలాన్ని 10 సంవత్సరాలకు మార్చడంతో కేవలం 72 మందినే అర్హులుగా ప్రకటించి విడుదల చేశారన్నారు. తరువాత ఆజాద్‌కా అమృత్ మహోత్సవ్ సందర్భంగా ఆగస్టు 15వ తేదీన రాష్ట్రంలో వివిధ జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలను విడుదల చేస్తామని ప్రకటించిందని, రాష్ట్ర క్యాబినెట్ కూడా ఆమోదం తెలిపిందని కాని వివిధ కారణాలతో వాయుదా వేయడంతో తీవ్ర నిరాశకు గురయ్యామన్నారు. చిన్న ఘటనలకు జైలుకు వెళ్లిన వారు సైతం ఇప్పటికీ బయటకు రాలేదని ప్రభుత్వం స్పందించి వెంటనే సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేయాలని కోరారు.

బలవంతంగా నాలా పనులు

- అడ్డుకున్న ఈశ్వర్ విల్లాస్ గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులు
- కాలనీలోని రోడ్డు నుంచి పనులు చేపట్టడంపై అభ్యంతరం
- స్థానికులకు మద్దతు పెరగడంతో పనులు నిలిపేసిన అధికారులు



ఈశ్వర్ గేటెడ్ కమ్యూనిటి గేట్ లోపల నిలబడి నిరసన తెలియజేస్తున్న స్థానికులు

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఈశ్వర్ విల్లాస్ గేటెడ్ కమ్యూనిటీకాలనీ నుంచి ప్రారంభించిన ఎస్ఎన్‌డీపీ, డ్రైనేజీ నాలా పనులను ప్రజలు అడ్డుకున్నారు. తమ కాలనీలోని రోడ్డు నుంచి ఈ పనులు వద్దని అధికారులకు పలు మార్లు కాలనీవాసులు మొరపెట్టుకున్న మంగళవారం బలవంతంగా పనులు ప్రారంభించడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అధికారులకు స్థానికుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. గతంలోని పాత నాలా ఉన్న ప్రాతం నుంచే ఈ పనులు చేపడితే ఎలాంటి ఇబ్బందులు ఉండవని స్థానికులు అంటున్నారు. ఎవరికో ప్రయోజనం చేసేందుకు ప్రజాప్రతినిధులు తమ గేటెడ్ కమ్యూనిటీకాలనీ నుంచి ఈ పనులు చేపట్టడం సరికాదన్నారు.

అధికారుల ఏకపక్ష నిర్ణయం..

అధికారులు తమను సంప్రదించకుండా, తమకున్న అనుమానాలను నివృత్తి చేయకుండా పనులు చేయడం ఎంత వరకు సమంజసమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల వివరణ కూడా వినకుండా ఏకపక్షంగా పనులు ప్రారంభించడం సరైంది కాదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజలు శాంతియుతంగా నిరసన తెలియజేస్తుంటే పోలీస్ బందోబస్తు మధ్య పనులు చేపట్టేందుకు ప్రయత్నలు సైతం చేశారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ నిజాంపేట్ అధ్యక్షుడు ఆకుల సతీష్ సంఘటన స్థలానికి వెళ్లి అక్కడ ప్రజలకు మద్దతుగా నిలబడ్డారు. అధికారులను పనులకు సంబంధించిన ప్రణాళిక ముందు చూపించి ప్రజలను ఒప్పించిన తర్వాతనే పనులు చేపట్టాలన్నారు. సమస్య తీవ్రమవుతందని తెలుసుకున్న అధికారులు పనులను నిలిపివేశారు. ఈ విషయంపై కమిషనర్ రామకృష్ణారావును 'సాక్షి'వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించినప్పటికి అందుబాటులోకి రాలేదు.



ప్రజలకు మద్దతుగా వచ్చిన నిజాంపేట్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్

అర్హులకు బ్యాంకర్లు రుణాలు ఇవ్వాలి

జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య



సాక్షి, మేడ్చల్ జిల్లా: అర్హులైన వారికి బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో బ్యాంకర్లు, సంబంధిత అధికారులతో డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశాన్ని ఆయన నిర్వహించారు. లక్ష్య సాధనలో వెనుకబడిన బ్యాంకర్లు తమ పనితీరును మెరుగు పర్చుకోవాలని ఆయన సూచించారు. రైతులకు పంట రుణాలు, టర్మ్ లోన్లు విరివిగా అందించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పరిశ్రమలు, డీఆర్‌డీఓ శాఖల ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు బ్యాంకులు ఉపాధి యూనిట్ల స్థాపన, చిన్న, మధ్య తరహా, విద్య, గృహ నిర్మాణం, ఇతర ప్రాధాన్యత రంగాలకు అర్హులైన లబ్ధిదారులకు మంజూరు చేయాలని కోరారు. చిరు వ్యాపారులు.. తమ వ్యాపారాలను విస్తరించుకోవడానికి రుణాలు అందించాలని అన్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు నిర్ణీత గడువులోగా రుణాల మంజూరుకు కృషి చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాల రుణాలను సకాలంలో తిరిగి చెల్లించేలా బ్యాంకర్లు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. బ్యాంకులు జూన్ త్రైమాసికంలో 67.70 శాతం లక్ష్యాన్ని సాధించినందుకు ఆయన అభినందించారు. వన్ టైం సెటిల్‌మెంట్‌పై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసులు, ఆర్బీఐ ఎల్‌డిఓ తాన్య, నాబార్డ్ డీడీఎం సురభి, జీఎండీఐసీ రవీందర్, జడ్పీ సీఈవో దేవసహాయం, డీఆర్డీవో పద్మజారాణి, జిల్లా వ్యవసాయాధికారి మేరీ రేఖ,వివిధ బ్యాంకుల మేనేజర్లు,ఉద్యాన శాఖ, మెప్మా, ఎస్సీ కార్పొరేషన్, డీఐసీ, కేవీఐసీ, ఆర్బీఐ, నాబార్డు అధికారులు పాల్గొన్నారు.

అవును.. వాళ్లిద్దరూ కలిశారు.!



కుత్బుల్లాపూర్: ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కలుసుకున్నారు. ఈనెల 21వ తేదీన ముఖ్యమంత్రి కేసీఆర్ కుత్బుల్లాపూర్ అభ్యర్థిగా వివేకానంద్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఇదే సీటుపై ఆశలు పెట్టుకున్న ఉద్యమ నాయకుడు, గతంలో పార్టీ కోసం త్యాగం చేసిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఎడమొహం.. పెడమొహంగా ఉంటూ వచ్చారు. ఎమ్మెల్యే పలు మార్లు ఎమ్మెల్సీని కలిసే ప్రయత్నం చేయగా అది సాధ్యం కాలేదు. దీంతో ఇద్దరి మధ్య దోబూచులాట కొనసాగుతూ వచ్చింది. ఇన్ని రోజులు కలవకుండా నే ఉంటూ వస్తున్న వీరు మంగళవారం ఎమ్మెల్సీ రాజు ఇంటికి ఎమ్మెల్యే వివేకానంద్ తన అనుచరులతో కలిసి వెళ్లి భేటీ అయ్యారు. పార్టీ విషయాలు మాట్లాడుకుని ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. దీంతో వీరిద్దరి మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు లేవనే దానికి కార్యకర్తలు ఒక నిర్ణయానికి వచ్చారు.

అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదు



గాజులరామారం డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదని.. ఎన్ని కోట్లు ఖర్చైనా వెనుకడుగు వేసేది లేదని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గాజులరామారం డివిజన్ పరిధిలోని మంగళవారం ఎమ్మెల్యే పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. బాలాజీ లేఅవుట్, రాయల్ పామ్స్, ప్రెస్టీన్ ప్యాలస్ కాలనీలలో రూ.2.75 కోట్ల ఎస్ఆర్‌డీపీ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్లు, బ్యాక్స్ డ్రైన్ పనులకు, గాజులరామారం గ్రామంలో రూ.54 లక్షలు, వీనస్ రాక్స్‌లో రూ.64 లక్షలతో భూగర్భ డ్రైనేజీ పనులు, మహంకాళి వీధిలో రూ.49.6 లక్షలతో భూగర్భ డ్రైనేజీ, బతుకమ్మ బండలో రూ.కోటితో రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.

- ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచామన్నారు. ప్రతి బస్తీ, కాలనీ అభివృద్ధికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ శ్రీనివాస్‌యాదవ్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు సోమేశ్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు కస్తూరి బాలరాజు, మక్సూద్ అలీ, కమలాకర్, గోవర్ధన్‌రెడ్డి, చిట్ల వెంకటేష్, దుల్లప్ప, అబేద్, మసూద్, విజయ్, శ్రీశైలం, గోపాల్, లక్ష్మణ్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఫ్యాషన్ టెక్నాలజీ, ఇంటీరియర్ డిజైన్స్ కోర్సులకు దరఖాస్తులు చేసుకోవడానికి ఆఖరు తేదీగా ఈనెల 31ని నిర్ధారించినట్లు 'మనూ' అడ్మిషన్స్ డైరెక్టరేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ వనజ మంగళవారం తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే సమర్పించడానికి అవకాశం ఉంటుందన్నారు. యూనివర్సిటీలో ఫ్యాషన్ టెక్నాలజీ, ఇంటీరియర్ డిజైన్‌లో సర్టిఫికెట్, డిప్లొమా, అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులలో అడ్మిషన్లు కల్పిస్తామన్నారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ క్యాంపస్‌లో ఫ్యాషన్ టెక్నాలజీ, ఇంటీరియర్ డిజైన్‌లో సర్టిఫికెట్ డిప్లొమా, అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు ఉంటాయని, లక్నో క్యాంపస్‌లో ఫ్యాషన్ టెక్నాలజీలో డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు అందించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు ఫారాలు, సాధారణ సూచనలు, ఇతర వివరాలు అన్నింటినీ యూనివర్సిటీ వెబ్‌సైట్ www.manuu.edu.inలో అందుబాటులో ఉంచామన్నారు.

క్రీడాకారిణికి చేయూత

సాక్షి, సిటీబ్యూరో: జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో భాగంగా రహేజా కార్ప్ గ్రూప్ కంపెనీ ఇనార్బిట్ మాల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, నిర్మాణ్ సంస్థతో కలిసి నిరుపేద క్రీడాకారులకు చేయూతని అందించే 'ధనుష్ శక్తి'ప్రారంభించింది. ఈ సందర్భంగా ఇనార్బిట్ మాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయా సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ.. యువ ఆర్చర్ తానిపర్తి చికిత పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన సామగ్రితో పాటు అన్నిరకాల తోడ్పాటు అందించనున్నట్లు తెలిపారు. పెద్దపల్లి జిల్లా సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన చికిత ప్రస్తుతం సీనియర్ ఇంటర్ విద్యార్థిని అని, సబ్-జూనియర్ నేషనల్ గేమ్స్‌లో రజత, కాంస్య పతకాలను సాధించి ఈ ఏడాది అక్టోబర్‌లో థాయిలాండ్‌లో జరిగే ఆసియా చాంపియన్‌షిప్‌కు సిద్ధమవుతోందని వివరించారు. సమావేశంలో క్రీడాకారిణి చికితతో పాటు శ్రవణ్ కుమార్ గోనె, శరత్ బెలవాడి, మయూర్ పట్నాల పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు

హఫీజ్‌పేట్: సామాజిక సేవ చేయడం సంతృప్తిని కలిగిస్తుందని మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్ పేర్కొన్నారు. మంగళవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని గంగారంలో సందయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేదల సౌలభ్యం కోసం ఉచితంగా కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కంటి అద్దాలను, ఆపరేషన్లు చేయిస్తున్నామన్నారు. లాభాపేక్ష లేకుండా, రాజకీయాలకతీతంగా సమాజానికి సేవ చేయాలనే మానవతా దృక్పథంతో నెలకొల్పబడ్డ ట్రస్ట్ సేవలు నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామస్తులు భిక్షపతి యాదవ్ సమక్షంలో బీజేపీలో చేరారు.

ఆకట్టుకున్న తెనాలి రామకృష్ణ నాటకం



రంగారెడ్డినగర్: చింతల్ నందానగర్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారులు సామెతలు, పొడుపు కథలు, గేయాలతో తల్లిదండ్రులను ఉపాధ్యాయులను అలరింపజేశారు. ఈ కార్యక్రమంలో తెనాలి రామకృష్ణుడి కథ నాటకం, తెలుగుభాష గొప్పదనం పాటపై విద్యార్థులు చేసిన నృత్యం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎస్ ఆర్ బాషా, తెలుగు ఉపాధ్యాయులు స్వర్ణ, మంజులారెడ్డి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి ఓటమే ధ్యేయంగా పనిచేస్తాం

- చింతల యాదగిరి, నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న యాదగిరి, నాగరాజు

కుత్బుల్లాపూర్: రెండు దశాబ్దాలుగా పార్టీలో ఉంటూ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న తమకు పార్టీలో ప్రాధాన్యత లేకపోవడంతోనే బీఆర్ఎస్‌ను వీడుతున్నామని బీఆర్ఎస్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల యాదగిరి, రాష్ట్ర ట్రేడ్ యూనియన్ నాయకుడు చింతల నాగరాజులు పేర్కొన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. పార్టీ కోసం పని చేసిన తమకు గుర్తింపు ఇవ్వడం లేదన్నారు. ఎమ్మెల్యే వేధింపులు అధికం కావడంతో బీఆర్ఎస్ సభ్యత్వానికి రాజీనామా చేస్తునామని తెలిపారు. ఎమ్మెల్యే వేధింపుల విషయమై సీఎం కేసీఆర్‌ను కలిసేందుకు అపాయింట్‌మెంట్ కోరినా ఇవ్వకపోవడం బాధ కలిగించిందని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఓటమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. కార్యకర్తలతో చర్చించి వారం రోజుల్లో తమ భవిష్యత్ కార్యచరణను ప్రకటిస్తామన్నారు.

ఒకటో తేదీ నుంచి మెగా లోక్‌అదాలత్

మేడ్చల్: వచ్చేనెల ఒకటి నుంచి 9వ తేదీ వరకు మెగా లోక్ అదాలత్‌లను నిర్వహిస్తున్నారని మేడ్చల్ ట్రాఫిక్ సీఐ హనుమాన్‌గౌడ్ తెలిపారు. ట్రాఫిక్ విభాగంలో పాత కేసులు, లైసెన్సులు లేని డ్రైవింగ్ కేసులు, డంకన్ డ్రైవ్ కేసులు, ఇతర కేసులున్న వారు లోక్ అదాలత్‌కు హాజరై కేసులను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

ప్రజలతో ఆప్యాయంగా..



ఈ చిత్రంలో కనిపిస్తున్న వారంతా శంభీపూర్ గ్రామస్తులు. మంగళవారం శంభీపూర్‌లోని తన ఇంటికి వచ్చిన వారిని లోపలికి రమ్మని కోరగా.. బిడ్డ ఇక్కడే కూర్చొని మాట్లాడుదాం అనడంతో ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ రాజు వారితో పాటు ఇంటి ముందే కూర్చుని ఆప్యాయంగా మాటలు కలిపారు. ఎట్లా ఉన్నారంటూ.. పలకరిస్తూ ఒక్కొక్కరి బాధలు విన్నారు. ఆసరా పింఛన్ వస్తుందా.! అని ఆరా తీశారు. ఓపిగ్గా చివరి వరకు వారి సమస్యలు విని పరిష్కరిస్తానని హామీ ఇచ్చి టిఫిన్, చాయ్ తాగించి పంపించారు.

– కుత్బుల్లాపూర్

ఎమ్మెల్సీకి రాఖీ శుభాకాంక్షలు



ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజుకు రాఖీలు కడుతున్న చిన్నారులు

కుత్బుల్లాపూర్: రాఖీ పండగ అన్నా చెల్లెళ్ల అనుబంధాన్ని పెంపొందిస్తుందని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. మంగళవారం భౌరంపేట్‌కు చెందిన శ్రీకర స్కూల్ విద్యార్థులు శంభీపూర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీకి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్ట్ ఆధారిత విద్య ఎంతో ఉపయోగం



విద్యార్థులు తయారు చేసిన నమూనాలు

జీడిమెట్ల: విద్యార్థులకు ప్రాజెక్టుల ఆధారంగా నేర్చుకున్న విద్య ఎంతగానో ఉపయోగపడుతుందని టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ టి.కోటిరెడ్డి అన్నారు. మంగళవారం అపురూపాకాలనీలోని టీవీఆర్ మోడల్ స్కూల్‌లో ప్రాజెక్ట్ బేస్డ్ లెర్నింగ్ విద్యావిధాన నిర్వాహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డైరెక్టర్ టి.కోటిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా టీవీఆర్ స్కూల్‌కు చెందిన 120మంది, ఎస్ఆర్ నాయక్‌నగర్ సత్యవాణి పాఠశాలకు చెందిన 95మంది మొత్తం 215మంది 9వ తరగతి విద్యార్థులు ప్రాజెక్ట్ నమూనాలను తయారు చేసి తీసుకొచ్చారు. ప్రాజెక్టుల పనితీరును మిగతా విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. సైన్స్, మ్యాథ్స్ విభాగాలలో విద్యార్థులు తయారు చేసిన నమూనాలు అందరినీ ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్లు వంశీ రెడ్డి, డా.రవిసూర, దీప్తిరెడ్డి, విద్యార్థులు వారి తల్లి దండ్రులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్‌లో కాంగి'రేసు'..

నియోజకవర్గం నుంచి ఎనిమిది మంది దరఖాస్తు

- ముగ్గురి పేర్లను అధిష్టానానికి పంపనున్న రాష్ట్ర నాయకత్వం
- టికెట్ వస్తుందనే ధీమాలో పలువురు నాయకులు
- ఎవరి పేరు అభ్యర్థిగా ప్రకటిస్తారోననేది సస్పెన్స్
- ఉత్కంఠగా ఎదురు చూస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు



కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ గెలిచే స్థానాలపై అధిష్టానం దృష్టి సారించింది. అందులో భాగంగా ఇటీవల గాంధీభవన్‌లో నియోజకవర్గ స్థాయిలో పోటీపడే నాయకుల నుంచి దరఖాస్తులు తీసుకున్న విషయం తెలిసిందే. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి ఏకంగా 8 మంది దరఖాస్తు చేసుకోవడంతో పార్టీ అధిష్టానం వీరిలో ముగ్గురిని ఎంపిక చేసి అధిష్టానానికి పంపే ఆలోచన ఉన్నారు. ఈ క్రమంలో మంగళవారం అసెంబ్లీ ఎన్నికల కోసం అభ్యర్థుల ఎంపికపై కీలక కసరత్తు ప్రారంభించిన కాంగ్రెస్ స్క్రీనింగ్ టెస్ట్ కోసం ఎన్నికల కమిటీ భేటీ అయ్యింది. అందులో ఎవరికి అవకాశం వస్తుందని ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.

8 మందిలో ముగ్గురు ఎవరో..?

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసేందుకు ఉత్సాహం చూపుతున్న పలువురు నేతలు ఇప్పటికే గాంధీభవన్లో తమకు టికెట్ కేటాయించాలని దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. గతంలో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన కొలను హనుమంత్ రెడ్డితో పాటు నర్సారెడ్డి భూపతిరెడ్డి, సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఉంటూ వస్తున్న సొంటి రెడ్డి పున్నారెడ్డి, కందడి జ్యోత్స్నారెడ్డి, సుమిత్ర జీవంధర్‌రెడ్డి ఈ ఐదుగురు ఒకే సామాజిక వర్గానికి సంబంధించిన వారు కావడంతో అందరికీ అవకాశం కల్పిస్తారన్నది అంతుచిక్కని ప్రశ్నగా మారింది.

- అదేవిధంగా మల్కాజ్‌గిరిరి యూత్ అధ్యక్షునిగా గత పది సంవత్సరాలుగా కొనసాగుతూ సీనియర్ నాయకులుగా సేవలందిస్తున్న బండి శ్యామ్‌గౌడ్, ఐఎన్‌టీయూసీ కార్మిక విభాగం తరఫున తనకు టికెట్ ఇవ్వాలని గుంజ శ్రీనివాస్, మైనారిటీ నుంచి నిజాముద్దీన్ సైతం తనకు అవకాశం కల్పించాలని దరఖాస్తు చేసుకున్న వారిలో ఉన్నారు. మొత్తం ఎనిమిది మంది దరఖాస్తు చేసుకోగా కాంగ్రెస్ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి ఇందులో ముగ్గురిని ఎంపిక చేసే పనిలో పడ్డారు. ఆ ముగ్గురు జాబితాను అధిష్టానానికి పంపించి వీరిని సమన్వయపరిచి ఒకరికి టికెట్ ఇచ్చే ఆలోచనలు ఉన్నట్లు తెలిసింది.

ముగ్గురిలో నేనుంటా ...అనే ధీమా!

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోసం నువ్వా నేనా అన్నట్లుగా పోటీ రసవత్తరంగా ఉండడంతో దరఖాస్తు చేసుకున్న నాయకులు కార్యకర్తలు వద్ద స్క్రీనింగ్ టెస్ట్‌లో ముగ్గురిలో నేను ఉంటాను అంటూ..! కార్యకర్తల్లో భరోసా నింపే ప్రయత్నం చేస్తున్నారు. రేవంత్‌రెడ్డి అండతో కొంతమంది జగ్గారెడ్డి సహకారంతో మరికొంత మంది సీనియర్ నాయకులమని ఇంకొంత మంది ఇలా ఎవరికి వారే టికెట్ వస్తుందన్న ధీమాతో ఉన్నారు. సెప్టెంబర్ మొదటి వారంలో ప్రకటించే జాబితాలో ఎవరికి టికెట్ వస్తున్నదన్నది హాట్ టాపిక్‌గా మారింది.